క్లుప్తంగా

బల్క్‌మిల్క్ యూనిట్ పరిశీలన



జంబూపట్నంలో బల్క్ మిల్క్ యూనిట్‌ను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో నిర్మిస్తున్న బల్క్‌మిల్క్ యూనిట్‌ను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.16 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. త్వరితగతిన విద్యుత్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనిట్‌కు రూ.10 లక్షలతో యంత్ర పరికరాలు కొనుగోలు చేసిందని, త్వరలో ఇక్కడ పాల సేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈ యూనిట్ పరిధిలో 46 జగనన్న పాలవెల్లువ పాల సేకరణ కేంద్రాలున్నాయన్నారు. ఆయన వెంటన పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్, జిల్లా సహకార అధికారి వై.ఉమా మహేశ్వరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి ఎన్‌వీవీఎస్ మూర్తి, కోరుకొండ ఏడీ పి.ప్రభావతి పాల్గొన్నారు.

నాడు - నేడు పనులపై ఆరా



నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న ఏపీఈ డబ్ల్యూఐడీసీ చైర్మన్ యనమల నాగార్జున

రాజానగరం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మన బడి నాడు - నేడు పథకం పనులను ఏపీ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ యనమల నాగార్జున శనివారం పరిశీలించారు. ఫేజ్ 1, 2లలో మంజూరైన నిధులతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించారా, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారా, పనుల నాణ్యత తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఈఈ జయకర్, జేఈ భీమశంకరం, ఎంఈఓ 2 జ్యోతి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చిన్నం వీరభద్రారెడ్డి, సుధారాణి దంపతులు కర్తలుగా వ్యవహరించారు. అర్చకులు భాస్కరశర్మ, రమణశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కొంకుదురు గ్రామానికి చెందిన సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, చిన్నం వెంకటనారాయణరెడ్డి, అనసూయమ్మ, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తొస్సిపూడి శివారు ప్రాంతంలో పందలపాక గ్రామానికి చెందిన ఎనిమిది మంది పేకాట ఆడుతుండగా పట్టుకుని అరెస్టు చేశామనా, వారి వద్ద నుంచి రూ.11,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వర్క్ ఫ్రం హోమ్ పేరుతో రూ.3.97 లక్షల మోసం

రాజమహేంద్రవరం రూరల్: వర్క్ ఫ్రం హోమ్ పేరుతో వచ్చిన యాడ్ చూసి ఓ యువతి రూ.3.97 లక్షలు మోసపోయింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటిలింగాలపేటకు చెందిన ఎం.అపర్ణకు మొబైల్‌లో రీల్స్ చూస్తుండగా వర్క్ ఫ్రం హోమ్ అవకాశం ఉందంటూ యాడ్ కనిపించింది. ఇంటి వద్దే ఉండి పనిచేస్తూ సొమ్ములు సంపాదించుకోవచ్చని ఆ ప్రకటన సారాంశం. సదరు యాడ్‌లోని ఫోన్ నంబర్‌కు మేసేజ్ చేస్తే, అటు నుంచి ఒక లింక్ వచ్చింది. ఆ లింక్‌పై టచ్ చేస్తే మూడు ప్రశ్నలతో టాస్క్ రావడంతో అపర్ణ తన బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేసింది. రూ.150 నుంచి మొదలైన సొమ్ములు పంపడం రూ.లక్షల వరకూ వెళ్లింది. మొత్తం రూ.3,97,000 పంపించి మోసపోయింది.

అభివృద్ధికి చిరునామాగా రాజానగరం

- మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్
- సీతానగరం మండలంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవం



రఘుదేవపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్



బూరుగుపూడి నుంచి వెళుతున్న పార్టీ నాయకులు



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన సభకు హాజరైన ప్రజలు

సీతానగరం: రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా నిలిచిందని మాజీ మంత్రి, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ కొనియాడారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, టెన్నిస్ క్రీడాకారిణి సైనా జైస్వాల్, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌తో కలిపి నియోజకవర్గంలో శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రఘుదేవపురంలో రూ.8 కోట్లతో నిర్మించే 30 పడకల ఆసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి శంకుస్థాపన, సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో రూ.2.45 కోట్లతో నెలకొల్పిన క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రజలకు అండగా జక్కంపూడి రాజా

అనంతరం జరిగిన సభలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు అత్యంత ఆప్తులుగా ఉండేవారన్నారు. ఇప్పుడు జక్కంపూడి రాజాను సీఎం జగన్ ఎంతో ఆప్యాయంగా చూసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ సైనా జైస్వాల్ చదువుతో పాటు టెన్నిస్‌లోరాణిస్తూ దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారన్నారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆయన ఒక్కరికి ఓటు వేసి గెలిపిస్తే, నలుగురం మీ సేవలో ఉంటామని తెలిపారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. పారిశ్రామిక వృద్ధి రేటులో దేశంలో మూడోస్థానంలో ఉన్నామన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు.

ఉత్సాహంగా బైక్ ర్యాలీ

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకూ బైక్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. అడుగడుగునా ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. సుమారు ఐదువేల మంది బైక్‌లపై వచ్చి ర్యాలీగా సీతానగరం చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు పాల్గొన్నారు.

మధురపూడి: బైక్ ర్యాలీకి కోరుకొండ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. కోరుకొండ, బూరుగుపూడి, గాదరాడ, శ్రీరంగపట్నం తదితర గ్రామాల నుంచి వచ్చిన వారితో రోడ్లన్నీ సందడిగా మారాయి.



బూత్ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బూత్ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి బూత్ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడలో శుక్రవారం రాత్రి బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ తనను ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. బూత్ కన్వీనర్లు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం పార్టీలకతీతంగా, గడపగడపకూ అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. శహపురం గ్రామం శివారులంక నుంచి టీడీపీకి చెందిన అనుసూరి అప్పారావు, అనుసూరి శ్రీనివాస్, అనుసూరి రాంబాబు, దొంగ వెంకటరమణ, పలివెల సంగ మహేశ్వరరావు, అనుసూరి అబ్బులుతో పాటు మరికొంత మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కేతా తులసి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, స్థానిక గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్ల పనితీరుపై సమీక్ష

ప్రకాశం నగర్: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం జిల్లాస్థాయి భవిత సెంటర్ల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భవిత సెంటర్ల పనితీరు, విద్యార్థుల రోలు, హాజరు మెరుగుపడాలని, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవిత సెంటర్లను నిర్వహించాలన్నారు. రోలు తక్కువగా ఉన్న మండలాల్లో పెంచడానికి ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఐఈ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఎస్.కనక బాబు, అకౌంట్స్ ఆఫీసర్ స్నేహలత, సెక్టోరియల్ అధికారులు గౌరీ శంకర్, శ్రీనివాస్, సమగ్ర శిక్షా సూపరింటెండెంట్ ఎం.రమణ పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై అసత్య ప్రచారం చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని లాలాచెరువు బత్తిన నగర్‌కు చెందిన మామిడి లక్ష్మణరావు శనివారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భరత్‌రామ్‌పై వారం రోజులుగా ఆయన ఫేక్ అకౌంట్‌తో సోషల్ మీడియాలోనూ, ఇతర మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. పలు ఆరోపణలతో పోస్టర్లు ముద్రించి నగరంలో పంచుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాజమహేంద్రవరంలో గొడవలు సృష్టించి, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు త్రీటౌన్ ఎస్సై నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రకాశం నగర్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. క్విజ్‌లో శ్రీ గౌతమి ప్రథమ, శ్రీచైతన్య టెక్నో ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వక్తృత్వ పోటీల్లో ఆర్.మీనాక్షి మొదటి, ఎంఎల్ ప్రసన్న రెండు, జి.శ్రీకాంత్ కుమార్ మూడో స్థానం సాధించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ రజనీ, జాకోబ్, వెంకట్రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



పెదపూడిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకానికి సారథులు వలంటీర్లేనని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వలంటీర్ల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు అని అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత మాత్రమే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేస్తున్నామంటే వలంటీర్ వ్యవస్థే కారణమన్నారు. అనంతరం ఆరుగురు వలంటీర్లకు సేవా రత్న, 351 మందికి సేవా మిత్ర అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పెదపూడి సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ

మండలంలోని జి.మామిడాడ శివారు పాటి మీద ప్రసిద్ధి చెందిన శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటుకు సహకరించిన భక్తులు, దాతలను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అనంతరం భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, చింతా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు

అనపర్తి: మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక కెనాల్ రోడ్డులోని అయ్యప్ప స్వామివారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కమిటీ చైర్మన్ పడాల రాజు గురుస్వామి ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పూజా క్రతువుల్లో సుమారు 300 మంది మహిళల చేత అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ జరిపించారు. అనంతరం పూజల్లో పాల్గొన్న మహిళలకు గురుస్వామి రాజు పసుపు, కుంకుమ, అమ్మవారి ప్రతిమలు అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరి భామిరెడ్డి, సాయిరేష్మారెడ్డి, పడాల వెంకటరెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి, అద్దాల శ్రీను, తుమ్మా సత్తిబాబు, పులగం శేఖర్‌రెడ్డి, పడాల మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని ఆర్‌ఎస్‌పేట వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భారీఎత్తున అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యామన దుర్గాభవానీ, వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల సత్తిరెడ్డి, ఆర్‌ఎస్‌పేట మాజీ సర్పంచ్ యామన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



పెదపూడి: మండలంలోని సంపరలో వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఏడు శనివారాల వ్రతం పూజల్లో భాగంగా మూడో శనివారం స్వామికి ప్రత్యేక తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా ఏపీత్రయం వెంకన్న తీర్థం

పెదపూడి: మండలంలోని ఏపీత్రయం గ్రామంలో వెంకన్నబాబు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామంతో పాటు కరకుదురు, దోమాడ, రామేశ్వరం పరిసర గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ అడబాల అనురాధ, సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన తదితరులున్నారు.

త్రిమూర్తుల తీర్థ మహోత్సవాలు ప్రారంభం

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో పంట పొలాల మధ్య కొలువైన త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) ఆలయంలో 77వ తీర్థ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. గ్రామంలోని పంట పొలాల మధ్య కొలువైన స్వామివార్లను దర్శించుకునేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ ఐదు రోజులూ దాతల సహకారంతో అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి శ్రీచక్రస్నానం



లక్ష్మీనరసింహస్వామికి శ్రీచక్రస్నానం చేయిస్తున్న పండితులు

పెదపూడి: మండలంలోని పుట్టకొండలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి శ్రీచక్రస్నానం చేయించారు. స్వామివారిని ఆలయం నుంచి పెద్ద కాలువ వద్దకు తీసుకెళ్లి ఆలయ ప్రధాన అర్చకుడు గోపాలచార్యులు ఆధ్వర్యంలో పండితులు శ్రీచక్రస్నానం కన్నుల పండువగా జరిపించారు. సర్పంచ్ వల్లి వెంకటరమణ, ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మధురపూడి: విద్యాహక్కు చట్టం ప్రకారం 2024 - 25 విద్యా సంవత్సరానికి గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు మండల విద్యాశాఖాధికారులు కుశలవ దొర, సుజాత తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలు, అనాథలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 14 వరకూ ఈ సేవ కేంద్రాలు, దగ్గరలోని సచివాలయం నెట్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఇష్టపడి చదివితే విజయమే



పరీక్షలకు సన్నద్ధమవుతున్న రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

- విద్యార్థులకు అధ్యాపకుల సూచన
- మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

రంగంపేట: విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించగలిగే కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఎంపిక చేసి పరీక్షా కేంద్రాల్లో పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షలకు సమయం దగ్గరపడడంతో కొందరు విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. అయితే ఉన్న కొద్దిపాటి సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికతో చదివితే ఎక్కువ మార్కులు సాధించొచ్చని అధ్యాపకులు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో పట్టుదలతో చదవాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో సింగంపల్లి హైస్కూల్ ప్లస్, రాజానగరం మండలం నుంచి గాయత్రి, దివ్య, రత్నం కళాశాలలతో పాటు పుణ్యక్షేత్రం హైస్కూల్ ప్లస్‌కు చెందిన 690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

నిపుణుల సూచనలివీ..

పరీక్షలకు వారం రోజులే సమయమున్న నేపథ్యంలో ఇప్పటికే చదివిన పాఠ్యాంశాలను కనీసం మూడు రివిజన్లకు సిద్ధపడాలి. ఏ సబ్జెక్టు ఎంత సేపు చదవాలో ఆచరణాత్మక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వేకువజామున 4 గంటల ప్రాంతంలో చదివితే బాగా గుర్తుంటుంది. చదివేటప్పుడు ప్రతీ గంటకు 10 నిమిషాలు విరామం తీసుకోవాలి. ఒకే రోజు నాలుగైదు సబ్జెక్టులు చదవకూడదు, ఏకాగ్రతకు భంగం కలిగించేవాటిని దగ్గరకు రానివ్వకూడదు. ఇతరులతో పోల్చుకుంటూ నిరాశ చెందకూడదు. పరీక్ష ప్రారంభానికి ముందు పుస్తకాలు చదవకూడదు. ఆ సమయంలో ప్రశాంతంగా ఉండాలి. పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకోవాలి. ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్‌లో పేరు, హాల్ టికెట్ నెంబర్, రాసే ప్రశ్నపత్రం సరిగ్గా ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తరువాతే మెయిన్ ఆన్సర్ బుక్‌పై సంతకం చేయాలి.

నమూనా పరీక్షలతో మేలు



ఎక్కువ నమూనా పరీక్షలు రాయడం ద్వారా తప్పులు ముందుగానే తెలుస్తాయి. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. పరీక్షలు అతి సమీపంలో ఉన్న నేపథ్యంలో ఇప్పటివరకూ చదవని కొత్త ప్రశ్నలను చదవడాన్ని విడనాడాలి. చదివిన పాఠ్యాంశాలను వీలైనంత పునశ్చరణ చేసుకోవాలి.

– వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రంగంపేట

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి



పరీక్షల ముందు శారీరకంగా, మానసికంగా విద్యార్థులు బాగా అలసిపోతారు. ఆరోగ్యంగా ఉంటేనే పరీక్షల్ని సమర్థంగా ఎదుర్కోగలం. పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలి. తక్కువగా ఎక్కువసార్లు తినాలి. కూరగాయలు, పండ్ల రసాలు, గుడ్లు లాంటివి తినడం శ్రేయస్కరం.

– వేణుశ్రీలక్ష్మి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రంగంపేట

ఈ నెల 27 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారు

అనపర్తి: మండలంలోని పులుగుర్తలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పాంచాహ్నికంగా ఐదు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రానుగుణంగా పెదపూడి రఘురామ్ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో జరుగనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 27న గోమాత గ్రామ ప్రదక్షిణ, విష్వక్సేన పూజ, రక్షాబంధనం, దీక్షాధారణ, వాస్తు హోమం, స్వామి వారి గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 28న త్రేతాగ్ని ప్రణయనం, ఆలయ బలిహరణ, 29న అష్టోత్తర శతఘటాభిషేకం, శ్రీవారి కల్యాణోత్సవం, మార్చి 1న బలిహరణ, 2న చూర్ణోత్సవం, వసంతోత్సవం, 4న మహాన్నదానం జరుగుతాయని సభ్యులు వెల్లడించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం, కల్తీ సరకులతో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. పిడింగొయ్యి పరిధిలోని హైఫామ్స్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన జురా హోటల్‌ను శనివారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆ హోటల్‌లో గడువు ముగిసిన రెండు రకాల ఆహార పదార్థాల ప్యాకెట్లను గుర్తించి, కేసు నమోదు చేశారు. అక్కడి చికెన్ ధమ్ బిర్యానీ నమూనాలను విశ్లేషణ కోసం నాచారంలోని ఫుడ్ లాబొరేటరీకి పంపిస్తామన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మీటర్ రీడింగ్ 25 శాతం లోపు మాత్రమే ఉండాలని, అంతకుమించి ఉంటున్నాయన్నారు. అటువంటి ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు.